## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి

ఐనవోలు, డిసెంబర్ 8 : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు కాత నాగయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి, వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతి, సర్పంచ్ కంజర్ల రమేశ్, ఎంపీటీసీ తాటికాయల రమేశ్, సంపత్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి ఉన్నారు.

## కిట్స్‌లో నేడు గ్రాడ్యుయేషన్ డే

హసన్‌పర్తి, డిసెంబర్ 8 : ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ కళాశాలలో శనివారం 39, 40వ ఎన్యువల్ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌కు చెందిన ఎల్‌టీఐ మైండ్ ట్రీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్, గ్లోబెల్ హెడ్ ఎంటర్‌ప్రైజ్ క్లౌడ్ యాప్స్, సేల్స్ ఫోర్స్ అమర్‌నాథ్ జూలూరి, కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 14 మందికి బంగారు పతకాలు అందజేయనున్నట్లు వివరించారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి నేత అశోక్



శాయంపేట, డిసెంబర్ 8 : మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన తెలంగాణ జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ శుక్రవారం జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. జాగృతిని బలోపేతం చేయాలని కవిత సూచించినట్లు తెలిపారు.

## పశు సంపదతో రైతులకు మేలు

వేలేరు/నెక్కొండ, డిసెంబర్ 8 : వ్యవసాయానికి పశువులు ఎంతగానో ఉపయోగపడతాయని, పశుపోషణతోనే రైతులకు మేలు జరుగుతుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని లోక్యాతండాలో శివశంకర గోశాల వారి ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం కోడె దూడలను 10 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. రైతులు పశువులను పెంచుకొని, మరింత ఆదాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దుర్గం రోజా, సర్పంచ్ మురావత్ అనురాధ, గోశాల కార్యదర్శి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు. అలాగే, నెక్కొండ మండలంలోని అడ్డబాట తండాలో పది రైతులకు కోడె దూడలను పంపిణీ చేశారు. సర్పంచ్ పూర్ణ, సూపర్‌వైజర్ దుర్గం రోజా పాల్గొన్నారు.

## 'అభివృద్ధి పనులను పూర్తి చేయాలి'

గీసుగొండ, డిసెంబర్ 8 : నగరంలోని 16వ డివిజన్ జాన్‌పాకలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ సంకరి మనీషా శివకుమార్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయినందున అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. స్థానికులు రాజు, ఆరిఫ్, బోనా రమేశ్, జమీల్, రత్నాకర్ పాల్గొన్నారు.

## 'దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలి'

హనుమకొండ, డిసెంబర్ 8 : కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం బస్సుల్లో దివ్యాంగులకు సైతం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని దివ్యాంగ సామాజిక వేదిక వ్యవస్థాపకుడు, దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. మహిళల మాదిరిగా తమకు కూడా ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని కోరారు.

## 11 నుంచి బడి బయట విద్యార్థుల గుర్తింపు సర్వే

హనుమకొండ సిటీ, డిసెంబర్ 8 : బడి బయటి విద్యార్థుల గుర్తింపు సర్వేను ఈ నెల 11 నుంచి వచ్చే నెల 10 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా గుణాత్మక విద్య కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. లష్కర్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఐఆర్పీలు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారం తీసుకుని సర్వే నిర్వహించాలన్నారు. 14 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ బీ రాధ, ప్లానింగ్ కోఆర్డినేటర్ టీ విజయ్‌కుమార్, డీఎల్ఎంటీ రఘు పాల్గొన్నారు.

# మిగ్‌జాం మిగిల్చిన నష్టం

- దుఃఖంలో అన్నదాతలు
- 40 వేల ఎకరాల్లో వరి, మిర్చి పంట నష్టం
- పండ్ల తోటలకూ తప్పని తెగులు



వర్షం వల్ల పుచ్చ పంటకు సోకిన బూడిద తెగులు

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 8: మిగ్‌జాం తుఫాన్ జిల్లాలోని రైతులను నిండా ముంచింది. తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో భారీ వానలు కురవకున్నా మూడు రోజుల పాటు ముసురు పడింది. దీనివల్ల అనేక చోట్ల పలు రకాల పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో సగం మండలాల్లో వాన కాలం పంటలు ముగిసి యాసంగి పంటల కోసం సమాయత్తమవుతున్నారు. హనుమకొండ డివిజన్‌లో వరి పంట దాదాపు 80 శాతం మేరకు పూర్తయింది. ధాన్యం కూడా కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలిపోయింది. అయితే పరకాల డివిజన్‌లో మాత్రం ఇంకా వరి కోతలు పూర్తి కాలేదు. కోసిన రైతులు కూడా కల్లాల్లోనే ఆరబెట్టారు. వర్షంతో వచ్చిన గాలి వల్ల కోతలకు సిద్ధంగా ఉన్న పొలాలు పూర్తిగా నేలవాలాయి. దీంతో తప్పని సరిగా చైన్ హార్వెస్టర్లను మాత్రమే వినియోగించాల్సి వస్తోంది. దీని వల్ల రైతులకు ఆర్థిక నష్టంతో పాటు, ధాన్యం కూడా పూర్తిగా రాకుండా నేలలోకి రాలి పోయే ప్రమాదముంది. ఇక కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. వీటిని మళ్లీ ఆరబెట్టి కొనుగోలు కేంద్రం ద్వారా మిల్లులకు తరలించాలంటే నాణ్యత సమస్యలు తలెత్తున్నాయి. మొత్తంగా 30 వేల ఎకరాల వరకు వరి పంటపై వర్షం ప్రభావం చూపినట్లు అధికారులు భావిస్తున్నారు. ఇక జిల్లాలో వరి తర్వాత మిర్చి పంట ప్రధానమైంది. ఇప్పటికే బ్లాక్ త్రిప్స్‌తో పాటు, ఎర్రనల్లితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ అకాల వర్షం వల్ల తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటికే కాపు దశలో ఉన్న మిరప తోటలు వర్షం వల్ల నేలపై పడిపోయాయి. ఇవే కాకుండా వర్షం మిరపకు ప్రతికూలంగా మారింది. దీనివల్ల అనేక తెగుళ్లు దాడి చేసే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. సుమారు 10 ఎకరాల్లో మిరప, ఇతర పంటలకు నష్టం వాటిల్లవచ్చని అంచనా. ఇవి కాకుండా ఇతర కూరగాయలు, పండ్ల తోటలు, పుచ్చ, ఖర్బూజ లాంటి పంటలకు కూడా పెద్ద ఎత్తున నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## నేడు ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి ప్రమాణ స్వీకారం

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 8 : అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి, గెలుపొందిన కడియం శ్రీహరి శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 1994లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా మొదటి సారిగా గెలిచిన కడియం, ఎమ్మెల్యేగా, ఎంపీగా, డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్సీగా పదవులు చేపట్టారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాకుండా, సాగునీటి సమస్య పరిష్కారానికి దేవాదుల ప్రాజెక్టును తీసుకువచ్చారు. నీతివంతమైన పాలనతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల్లో స్థానం సంపాదించుకున్న కడియం శ్రీహరి నేడు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో నియోజకవర్గ ప్రజలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. కడియం శ్రీహరి ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య శ్రేణులు, కడియం అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లనున్నారు.

## 'ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి'

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 8 : ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జాక్) కన్వీనర్ ఈసం సుధాకర్ కోరారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడాలు అక్రమంగా తమ ఉద్యోగాలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ రాజ్యాంగ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నాయకులు దబ్బకట్ల సుమన్, కల్తీ వీరాస్వామి, భాస్కర్, ఈక నాగేశ్వరారావు, పడిగ నాగేశ్వరరావు, లింగాల కిరణ్‌కుమార్, దనసరి సుధాకర్ పాల్గొన్నారు.

## బాలాజీకి డాక్టరేట్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 8 : కేయూ పొలిటికల్ సైన్స్‌లో లకావత్ బాలాజీకి పరీక్షల నియంత్రణ అధికారి మల్లారెడ్డి డాక్టరేట్ ప్రకటించారు. 'పెర్ఫార్మన్స్ అఫ్ మోడల్ స్కూల్స్ ఇన్ తెలంగాణ స్టేట్ - ఎ కేస్ స్టడీ ఆఫ్ జనగామ డిస్ట్రిక్ట్' అనే అంశంపై విశ్రాంత ఆచార్య జీ వీరన్న పర్యవేక్షణలో ఆయన తన పరిశోధన పూర్తిచేశారు. సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బెక్కల్ శివాలితండాకు చెందిన బాలాజీ ప్రస్తుతం చేర్యాల మోడల్ స్కూల్‌లో పీజీటీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా బాలాజీని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు అభినందించారు.




మట్టి పాత్రల తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

## చేతి వృత్తుల పరిశీలన

వర్ధన్నపేట, డిసెంబర్ 8 : చేతివృత్తిదారులు తయారు చేసే వస్తువులను వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు శుక్రవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో చేతి వృత్తులపై అవగాహన కల్పించాలనే విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని ఇల్లంద గ్రామంలో కమ్మరులు కుండల తయారీ, చేనేత కార్మికులు మగ్గాలపై వస్త్రాల తయారీని పిల్లలకు చూపించారు. దీనివల్ల విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ వ్రతాలు

గిర్మాజీపేట, డిసెంబర్ 8: కార్తీకమాస శుక్రవారం సందర్భంగా బట్టలబజార్‌లోని శ్రీబాలనగర్ వేంకటేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించినట్లు ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు తెలిపారు. వేంకటేశ్వరస్వామి సేవాసమితి-1, శ్రీవారి ఉత్సవ సేవా సమితి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు రవ్వ కృష్ణమూర్తి, నంద కిశోర్, లక్ష్మణ్, అశోక్, రాంప్రసాద్, విజయ్, అర్చకులు శ్రీధరాచార్యులు, శ్రీనివాసాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.



టీఎల్ఎం కిట్లను అందజేస్తున్న ఐఈ కోఆర్డినేటర్ సుభాష్

## టీఎల్ఎం కిట్లు అందజేత

గిర్మాజీపేట, డిసెంబర్ 8 : జిల్లాకు చెందిన 31 మంది ప్రత్యేక అవసరాలు గల ఎస్సీ, ఎస్టీ పిల్లలకు టీఎల్ఎం కిట్లను ఎన్ఐఈపీఐడీ సికింద్రాబాద్ అధికారులు గౌసియా ఫరీన్, ఉష శుక్రవారం డీఈవో కార్యాలయం ఆవరణలో అందజేశారు. జిల్లా ఐఈ కోఆర్డినేటర్ సుభాష్ మాట్లాడుతూ టీఎల్ఎం ఉపకరణాలను ఎలా వినియోగించుకోవాలో ఐఈఆర్పీలు తెలియజేస్తారని అన్నారు. హనుమకొండ జిల్లా ఐఈ కోఆర్డినేటర్ రాధ పాల్గొన్నారు.

## రైలు నుంచి పడి వ్యక్తి మృతి

కాజీపేట, డిసెంబర్ 8 : రైలులో నుంచి గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. కాజీపేట రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం 25-30 ఏళ్లు ఉన్న గుర్తు తెలియని రైలులో నుంచి కింద పడిపోయి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరుకలేదని తెలిపారు.

## వైన్స్‌షాపు ఎదుట మహిళల ఆందోళన

కమలాపూర్, డిసెంబర్ 8 : మండలంలోని అంబాలలో వైన్స్‌షాపు ఎదుట మహిళలు ఆందోళన శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ వైన్స్‌షాపు నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మద్యం దుకాణాన్ని అంబాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు వైన్స్‌షాపు నడుపుకొంటుండగా కొందరు వ్యక్తులు కావాలనే ఆందోళన చేయిస్తున్నట్లు షాపు నిర్వాహకులు తెలిపారు. యజమాని శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీమాఫర్హీన్ తెలిపారు.

## 'నిందితులను కఠినంగా శిక్షించాలి'

కాజీపేట, డిసెంబర్ 8: నల్లగొండ జిల్లాలో దళిత మహిళను దారుణంగా రాళ్లతో కొట్టి, చున్నీతో హత్యచేసిన నిందితును కఠినంగా శిక్షించాలని పట్టణ అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. కాజీపేటలో సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, మూడు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. డీఎస్పీతో విచారణ జరిపి దోషులను శిక్షించాలని కోరారు. నాయకులు భూషపాక శ్రీనివాస్, మహేశ్, వేణు, శ్రీనివాస్, చంద్రశేఖర్, మల్లేశ్, రాజ్‌కుమార్, జానీ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, డిసెంబర్ 8 : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు సేవ చేసిన వ్యక్తులు, స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులను జిల్లా సంక్షేమశాఖ తరపున సన్మానించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల10లోగా wdsc.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రేపు కార్తీక వనభోజనాలు

న్యూశాయంపేట, డిసెంబర్ 8 : గోపా ఆధ్వర్యంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం నిర్వహించే వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెండు జిల్లాల అధ్యక్షులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ కోరారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌడ కులస్తులు పాల్గొనాలని కోరారు.